

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


# తవ్వారు.. వదిలేశారు

★సిఎం ఇలాకాలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం ★అసంపూర్తిగా దౌల్తాబాద్-కోస్గి రోడ్డు ★16 కి.మీ రోడ్డు పనులకు రూ.30 కోట్లు మంజూరు ★తొమ్మిది కిలోమీటర్ల వరకూ మాత్రమే పూర్తి ★ప్రాణ సంకటకంగా మారిన ప్రయాణం




రహదారి దుస్థితి కారణంగా అదుపు తప్పి పల్టీకొట్టిన కారు, బైక్ (ఫైల్)

**దౌల్తాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, కోట్లాది రూపాయల నిధులను వరదలా పారిస్తుంటే.. క్షేత్రస్థాయిలో మాత్రం కాంట్రాక్టర్ల తీరు దేవుడు కరుణించినా పూజారి వరమివ్వని చందంగా మారింది. కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్-కోస్గి వెళ్లే బీటీ రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**మృత్యుపాశాలుగా గుంతలు**

సీఎం నియోజకవర్గం అంటే పనులు పరుగులు పెడతాయని భావించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. రోడ్డును సగం సగం తవ్వి వదిలివేయడంతో, అసంపూర్తిగా ఉన్న గుంతలు, తేలిన కంకర రాళ్లతో ఈ మార్గం మృత్యుపాశంలా మారింది. నిధుల కొరత లేకపోయినా, పనులు పూర్తి చేయడంలో చూపుతున్న నిర్లక్ష్యం వెనుక మతలబు ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**రక్తసిక్తమవుతున్న రహదారి**

రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో బైక్‌లపై వెళ్లే ప్రయాణికులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ దారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఎంతో మంది వాహన చోదకులు కిందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. ఒకవైపు సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని చూస్తుంటే, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. పనులు మొదలుపెట్టి నెలలు గడుస్తున్న తవ్విన చోట కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని, దీంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పట్టించుకోని ప్రజాప్రతినిధులు**

ముఖ్యమంత్రి సొంత గడ్డపైనే ఇంతటి నిర్లక్ష్యం జరుగుతున్న స్థానిక అదికారులు, ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం గమనార్హం. పర్యవేక్షణ లోపం వల్లనే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, యుద్ధ ప్రాతిపాదికన దౌల్తాబాద్-కోస్గి రోడ్డు పనులను పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

పనుల వేగం పెంచుతా: ఏఈ

ఈ రహదారి పనుల జాప్యంపై ఆర్అండ్‌బి ఏఈ శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా.. దౌల్తాబాద్-కోస్గి రోడ్డు పనులకు సంబంధించి నిధుల కొరత ఏమీ లేదని, దౌల్తాబాద్-కోస్గి, రావులపల్లి-మద్దూర్, రావులపల్లి-గుల్బార్గా వరకు కలిపి మొత్తం 120 కోట్ల రూపాయల ప్యాకేజీ మంజూరైందని చెప్పారు. ఇందులో దౌల్తాబాద్-కోస్గి మధ్య ఉన్న సుమారు 16 కిలోమీటర్ల రోడ్డు పనుల విలువ దాదాపు 30 కోట్లు ఉంటుందని చెప్పారు. ఇప్పటికే 16 కిలోమీటర్లకు గాను.. తొమ్మిది కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయని వివరించారు. కొన్ని చోట్ల ల్యాండ్ ఇష్యూ ఉండటం వల్ల పనుల్లో కొంత జాప్యం జరిగిందని పేర్కొన్నారు. మిగిలిన పనులను కూడా కాంట్రాక్టర్ ద్వారా త్వరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

# ఇంధన కొరత - బంకులకు పోటెత్తిన వాహనాలు

**ఆమనగల్లు, ఏప్రిల్28, ప్రభాతవార్త:** ఆమనగల్లులో ఇంధన కొరతతో పలు బంకులు మూతపడ్డాయి. పట్టణంలో నాలుగు ఇంధన స్టేషన్లు ఉండగా అందులో మూడు స్టేషన్లు నోస్టాక్ బోర్డులు పెట్టాయి. ఇంధనం దొరక్క పలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేవలం రాఘవేంద్ర ఫిలింగ్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ బంకులోనే స్టాక్ ఉన్నది. దీంతో ఆస్టేషన్ పరిసరాలు వాహనాలతో క్రిక్కిరిసిపోయింది. ఒక్కసారిగా జనం ఎగబడడంతో స్టేషన్ మొత్తం రద్దీగా దర్శనమిచ్చింది. వాహనాలతోపాటు చిరువ్యాపారుల కొనుగోలుతో గందరగోళ పరిస్థితి తలెత్తింది. చేతిలో డబ్బాలు, పడిగాపులతో కనిపించారు.



ఆమనగల్లులో ఇంధనం కోసం వచ్చిన జనం

# ప్రైవేటే గతి!

**నేటికీ బస్సు సౌకర్యం లేక యేడు ఊళ్ల అవస్థలు**

**మరో యేడు గ్రామాలకు రోజుకు రెండు సర్వీసులే**

**మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్**

**శిథిలావస్థలో భవనం..ఎర్రటి ఎండలో తప్పని నిరీక్షణ**

**మర్పల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** మారుమూల ప్రాంతాలకు సైతం రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఓవైపు పాలకులు ప్రకటనలు చేస్తుంటే మరోవైపు నేటికీ ఆర్‌టిసి బస్సు ఎరగని గ్రామాలు కనిపిస్తున్నాయి. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని రావులపల్లి, తిమ్మాపూర్, కుదుకుంట, గుర్రంగట్టు, షాపూర్, మొగిలిగుండ్ల, బుదేరా గ్రామ పంచాయతీలకు నేటికి ఎర్రబస్సు సౌకర్యమే లేదు. జంషదాపూర్, ఘనాపూర్, పిల్లిగుండ్ల, గుండ్లమర్పల్లి, నర్సాపూర్, బిల్‌కల్, తుమ్మలపల్లి, గ్రామాలకు ఉదయం, సాయంత్రం ఒక్క సారి బస్సు వచ్చిపోతుంది. మండలంలో 29 గ్రామ పంచాయితీలుండగా అనేక గ్రామాలకు ఆర్టీసీ సేవలు అంతంత మాత్రమే. మండలంలో ప్రతి మంగళవారం నాడు మార్కెట్, సంత జరుగుతుంది. వివిధ గ్రామాల నుండి పండించిన ఉత్పత్తులు అమ్ము కోవడానికి రైతులు రాకపోకలు చేస్తుంటారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, కళశాలు మండల కేంద్రంలోనే ఉన్నాయి. ఆర్టీసీ సౌకర్యం లేకపోవడంతో అధిక ఛార్జీలు చెల్లించి ఆయా గ్రామాల ప్రజలు ప్రైవేటు వాహనాలలో రాకపోకలు చేయాల్సి వస్తోంది. కొన్ని సమయాలలో ప్రైవేటు వాహనాలు సైతం లేకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతం.

ఇక మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్ విషయానికొస్తే.. శిథిలవస్థకు చేరి పూర్తిగా ఆధ్వానంగా మారింది. చెత్తాచెదారంతో నిండి పశువులకు నిలయంగా మారింది. మర్పల్లి తాలుకా కేంద్రంగా మారినప్పుడు దీనిని నిర్మించారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా గాలికి వదిలేయడంతో శిథిలవస్థకు చేరింది. బస్టాండ్‌లోకి బస్సులు కూడా వెళ్లడంలేదు. బస్సుల రాకపోకలకోసం ఎండైన, వానైన రోడ్డు పక్కన నిరీక్షించాల్సి వస్తోంది.



మర్పల్లి బస్టాండ్ దుస్థితి

బస్టాండ్‌లో కనీస సదుపాయాలైన తాగునీరు, కూర్చోవడానికి బల్లలు, మరుగుదొడ్లు సైతం లేకపోవడంతో ప్రయాణికులు బాధలు వర్ణనాతీతం. బస్టాండ్ చుట్టూరా ఎక్కడా నిలువ నీడలేకపోవడంతో వేసవి సెగకు అలమటించిపోతున్నారు.

మర్పల్లి మండల కేంద్రం నుండి రోజూ వందలాది మంది ప్రయాణికులు నగరాలకు, వివిధ గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడికి వికారాబాద్, తాండూర్, సంగారెడ్డి, జహీరాబాద్, హైదరాబాద్, డిపోలకు చెందిన బస్సులు వచ్చిపోతుంటాయి. వ్యాపారవేతలు, విద్యార్థులు, ప్రయాణికులు రోజూ అధిక సంఖ్యలో రాకపోకలు చేస్తారు. కనీసం బస్సుల సమయపాలన బోర్డు కుడా లేకపోవడంతోఎప్పుడు ఏబస్సు వస్తుందో కూడా తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు వాపోతున్నారు.

# వైద్యులు అందుబాటులో లేకపోతే చర్యలు తప్పవు

**ఎక్స్‌రేను వెంటనే మరమ్మత్తులు చేయించాలి**

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**మర్పల్లి ,ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** వైద్యులు విధి నిర్వాహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం నాడు మర్పల్లి మండలంలోని ఘనపూర్, కొత్లపూర్, మండల కేంద్రంలో పర్యటించారు. మర్పల్లి ప్రభుత్వ హాస్పిటల్‌ను కలెక్టర్ సందర్శించి. వైద్య సేవలు ఎలా అందు తున్నాయాఅని రోగులను అడిగి తెలుసుకున్నారు .రిజిష్టర్‌లను పరిశీలించారు. మాన్యువల్ హాజరు ఎన్ని నాళ్ళు వాడుతారని డిజిటల్ పద్ధతి వాడాలని వారికి సూచించారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే మిషన్ పాడైపోవడంతో ఎక్స్‌రే కోసం బైటికి పంపుతున్నారని ,అంబులెన్స్ లేకపోవడంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోగులు కలెక్టర్‌కుతెలిపారు. వెంటనే ఎక్స్‌రేను మరమ్మత్తులు చేయించాలని, అంబులెన్స్ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. కస్తూర్బాపాఠశాలను సందర్శించి 42 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణం పనులను పరిశీలించారు. కొత్లాపూర్ గ్రామంలో పల్లె దవాకానాలను పరిశీలించారు. ఘనపూర్ గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్లను, దవాకానాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లనిర్మాణం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన కిశోర బాలికల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కలెక్టర్ వెంట తాశిల్దార్ పురుషోత్తం, ఎంపిడిఒ శ్రీనివాస్, ఎంఈఓ అశోక్ పలు శాఖల అధికారులు వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి సేవలను తెలుసుకుంటున్న కలెక్టర్



ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

# ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌కు సిఎం శంకుస్థాపన



రంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 28,ప్రభాతవార్త :ఫ్యూచర్ సిటీ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవనానికి సిఎం శంకుస్థాపన చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ కేవలం ఒక నగరం కాదు.. తెలంగాణ భవిష్యత్తును మలిచే అభివృద్ధి సంకల్పం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, మండలి చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి, ఎంపిలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీ డ్రగ్స్ పట్టివేత

**-బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడి లగేజీలో 6.5 కిలోల విదేశీ గంజాయి స్వాధీనం**

**-రూ.2.15 కోట్ల విలువగా అంచనా**



**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్28, ప్రభాతవార్త:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా విదేశీ గంజాయి పట్టుబడటం కలకలం రేపింది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ చేరుకున్న ఓ ప్రయాణికుడి వద్ద నుంచి సుమారు 6.5 కిలోల విదేశీ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ. 2.15 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్‌ఐ) అందించిన విశ్వసనీయ సమాచారంతో అప్రమత్తమైన కస్టమ్స్ అధికారులు శంషాబాద్ విమా నాశ్రయంలో మాటువేసి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికుడి లగేజీని క్షుణ్ణంగా పరిశీలించగా, అందులో అత్యంత చాకచక్యంగా దాచిన విదేశీ గంజాయి బయటపడింది. కస్టమ్స్ అధికారులకు ఏమాత్రం అనుమానం రాకుండా లగేజీ బ్యాగులో ప్రత్యేకంగా రహస్య అరలను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలను తరలించే ప్రయత్నం చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు, ఈ డ్రగ్స్ స్మగ్లింగ్ వెనుక ఉన్న అంతర్జాతీయ ముఠాపై దర్యాప్తు ముమ్మరం చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వరుసగా మాదకద్రవ్యాల పట్టివేతలు చోటుచేసుకోవడం భద్రతా సంస్థలను మరింత అప్రమత్తం చేసింది.

# ఓటరు సవరణ మ్యాపింగ్ ప్రక్రియను పెంచాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మంగళవారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 2002 నుండి ఉన్న ఓటరు జాబితా 2025 ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు.

అదనపు కలెక్టర్లు ఫైజన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డిలతో కలిసి ఓటరు మ్యాపింగ్‌పై డిప్యూటి కమిషనర్, ఎఆర్ఓ, ఈఆర్ఓలతో సమీక్ష జరిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా ఇంటింటికి వెళ్లి సర్వే చేసిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓలకు ఒక చోట తక్కువ లిస్టులు కాకుండా ఇంచుమించు సమానంగా ఉండేలా కేటాయించాలని ఆయన సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియపై తహాశీల్దార్లు దృష్టి పెట్టి త్వరితగతిన వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా పది ఇరవై శాతం తక్కువగా అయిన మ్యాపింగ్ ప్రక్రియ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తదుపరి సమావేశం వరకు మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి కనిపించని ఎడల తీవ్ర చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ఈసమావేశంలో తహాశీల్దార్లు, ఎంఎంసి సర్కిల్ డిప్యూటి కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.




# ఆమనగల్లులో యుపి మంత్రి సందడి

**ఆమనగల్లు, ఏప్రిల్28, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్ రాష్ట్ర జల్‌శక్తిశాఖ మంత్రి స్వతంత్ర దేవ్‌సింగ్ మంగళవారం ఆమనగల్లు పట్టణంలో సందడి చేశారు. హనుమాన్ భక్తుడైన ఆయన ప్రత్యేక ఉపవాసం వేళ పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ప్రాంతంలోని హనుమాన్‌దేవాలయం సందర్శించి కుటుంబసభ్యులతో కలిసి ఆయన పూజలు చేశారు. జాతీయ ఒబిసి కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి యూపి మంత్రికి ఘన స్వాగతం పలికారు. కుటుంబసభ్యులతో కలిసి శ్రీశైలం పుణ్యక్షేత్రం వెళుతున్న సందర్భంగా ఆమనగల్లులో కొద్దిసేపు ఆగారు. ఆచారి నివాసంలో జరుగుతున్న కుమారుని వివాహ్ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తల్లోజు గీత ఆచారి, కౌన్సిలర్లు మొక్తాల వెంకటయ్య, ఎర్రవోలు మహేశ్, కోఆప్షన్‌మెంబర్లు చుక్క అల్లాజీగౌడ్, జిల్లా నాయకులు గోరటి నర్సింహ్మా, చెక్కాల లక్ష్మణ్, మండల అధ్యక్షుడు కెకెశ్రీను, పట్టణ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, శ్రీకాంత్‌సింగ్, చెన్నకేశవులు, సునీత, మల్లయ్య, ఆనంద్, కండె భాస్కర్, వరికుప్పల శ్రీనివాస్, వడ్డెరాజు, నాగిళ్ల లక్ష్మణ్, చెక్కల సాయికుమార్ తదితరులు ఉన్నారు.



ఆమనగల్లులో పూజలు చేసిన మంత్రి దేవ్‌సింగ్

# అభివృద్ధిలో శాంతి భద్రతలే కీలకం




**కందుకూరు, ఏప్రిల్, (ప్రభాతవార్త):** శాంతి భద్రతలు బాగుంటేనే రాష్ట్రాలు దేశాలు అభివృద్ధి పధాన ముందుకు సాగుతాయని వాణిజ్య వ్యాపార రంగాలు విజయవంతంగా అమలు జరుగుతాయని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్పేట గ్రామంలో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ భవన శంకుస్థాపన కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోలీసు యంత్రాంగం దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. దానికి నిదర్శనం ఈ రాష్ట్రం పట్ల ప్రపంచ దేశాల లోని అభివృద్ధి చెందిన ప్రాంతాల నుండి ఇక్కడ వ్యాపారం చేయడానికి వచ్చే పారిశ్రామికవేత్తల ఉత్సాహం అదేవిధంగా ఇటీవల ప్రభుత్వం సమక్షంలో లొంగిపోయిన నక్సలైట్లు మెజారిటీ సంఖ్య తెలంగాణ పోలీసుల పట్ల ఉన్న విశ్వాసాన్ని పరిగణలోకి తీసుకొని లింకుపోవడమే నిదర్శనం అన్నారు. దానికి కారణం ఈ ప్రాంతంలో శాంతిభద్రతలు సక్రమంగా ఉండడం పోలీసులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేలా వ్యవహరించడం ప్రజలలో నమ్మకాన్ని కల్పించడం ప్రజల పట్ల స్నేహపూర్వక వాతావరణాన్ని అమలు చేయడం అని పేర్కొన్నారు. అదేవిధంగా పోలీసు యంత్రాంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మకమైన మార్పులు డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ టీం ద్వారా చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలు సంఘ వ్యతిరేక కార్యక్రమాలను అదుపు చేయడంలో సత్ఫలితాలు సాధించడం రాష్ట్రంలో మంచి పోలీసు వ్యవస్థకు నాంది పలకడం నిదర్శనం అన్నారు. అందులో భాగంగానే భారత్ ఫ్యూచర్ సిటీ దేశానికి కాకుండా ప్రపంచానికి రోల్ మోడల్‌గా నిల వాలని ప్రపంచ దేశాలలో ఉన్నత స్థాయిలో ఉన్న నగరాలకు దీటుగా భారత్ ఫ్యూచర్ సిటీ నిలవాలనే లక్ష్యంతో ఇక్కడ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు విజయవంతం కావడానికి ముందుగా ఇక్కడ ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం అభివృద్ధికి మూలంగా నిలుస్తుంది అన్నారు. ప్రభుత్వం భారత్ ఫీచర్ సిటీ కమిషనరేట్ ఏర్పాటుకు 25 ఎకరాల భూమిని సమకూర్చడం జరిగింద న్నారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి ముందుకు జరగాలన్న శాంతిభద్రతలు అదుపులో ఉండాలని దానికి పోలీస్ శాఖ ప్రణాళికలు రచించింది అన్నారు .దానికి ఈ ప్రాంత ప్రజలు సహకరించాలని వారి సహజయ సహకారుల ద్వారానే ఈ ప్రాంతం ప్రపంచానికి దిక్సూచిగా నిలుస్తుందని మంత్రి శ్రీధర్ బాబు తెలియజేశారు.

**గిరి దర్శకుల నియామకం**

ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ భవన నిర్మాణానికి మీర్ఖాన్పేట్ గ్రామంలో శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన సిఎం రేవంత్ రెడ్డి సహచర మంత్రివర్యులు దుదిల్ల శ్రీధర్ బాబు, మరియు జూపల్లి కృష్ణారావు ల చేతుల మీదుగా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన గిరి పుత్రులకు గిరి దర్శక నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గిరి దర్శక కార్యక్రమం గిరిజన మారుమూల ప్రాంతాలలోని యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంతోపాటు తెలంగాణ రాష్ట్రంలో వికాసానికి నోచుకోని టూరిజం ప్రాంతాలను గుర్తించి వారికి ఈ గిరి దర్శకుల ద్వారా పర్యాటకులకు గైడ్ చేయడం జరుగుతుందన్నారు .అది టూరిజం అభివృద్ధికి దూరం చేస్తుందని తెలియజేశారు. రాష్ట్రంలో టూరిజం ప్రాంతాలు అనేకం ఉన్నాయని అవి బయట ప్రపంచానికి తెలియకుండా ఉన్నాయని ఇది రాష్ట్ర అభివృద్ధి కి ప్రతి బంధకమని దాన్ని అభివృద్ధి చేయడానికి మారుమూల ప్రాంతాలలో ఉన్న టూరిజం ప్రాంతాలను వెలుగులోకి తేవడానికి టూరిజం శాఖ, అటవీ శాఖ, పోలీసు శాఖ, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాలలో ఉండి అవకాశాలు లేక చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యే యువతను అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉంచడమే కాకుండా ప్రజలలో మనోధైర్యాన్ని పెంచడం ఉపాధి అవకాశాలను కల్పించడం సమాజంలో వారి బాధ్యతలను తెలుసుకునేలా తయారు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. ఇది ప్రారంభం మాత్రమేనని మారుమూల లో ఉన్న ప్రజలు గిరిపుత్రులు సమాజానికి చేరువగా చేయడం ఉపాధి అవకాశాలను పెంచడంలో రిమోట్ ప్రాంతాల నుండి ప్రజలను గుర్తించి వారికి ఈ కార్యక్రమాలలో భాగస్వాములను చేయడం జరుగుతుందన్నారు. ఈరోజు గిరి దర్శకులుగా నియమితులైన వారే భవిష్యత్తులో వారి సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని ఆ దిశగా వారికి స్కిల్ యూనివర్సిటీ ద్వారా శిక్షణను అందజేయడం పర్యాటకులకు ఆయా ప్రాంతాలలోని విషయాలను తెలియజేసే విధంగా స్కిన్ అందజేయడం జరుగుతుంద న్నారు. గిరి దర్శకులు హిందీతో పాటు ఇంగ్లీషు నేర్చుకొని ఇతర దేశాల నుండి వచ్చే పర్యాటకులకు కావలసిన సమా చారాన్ని అందించేలా సంసిద్ధులు చేయడానికి ఆయా శాఖలు పనిచేయాలని గుర్తు చేశారు. పర్యాటక శాఖను విస్తరించడం ద్వారా ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు స్థానిక నాయకులు కిచన్న గారి లక్ష్మారెడ్డి, బొక్కజంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ కృష్ణ నాయక్, డైరెక్టర్ సురేందర్, సర్పంచులు శ్రీవిద్య, శ్రీనివాస్, సరికొండ పాండు, పల్స మహేష్ గౌడ్, నాయకులు ఎస్ వెంకట్రాంరెడ్డి, సాయిలు, నరసింహ, రాణా ప్రతాప్ రెడ్డి ,జగన్, పాండు, పాల్గొన్నారు.

# వార్త ప్రభావం: దిగివచ్చిన జిల్లా మిషన్ భగీరథ అధికార యంత్రాంగం

**పెద్దేముల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** గత ఆరు రోజులుగా మిషన్ భగిరథ నీళ్ళు బంద్ కావడంతో మంగళవారం వార్త పత్రికలో నీరో తరహాలో అధికార గణం కథనం ప్రచురితం కావడంతో జిల్లా మిషన్ భగిరథ అధికార యంత్రాంగం దిగివచ్చింది. పెద్దేముల్ మండలంలోని మంబాపూర్, రుక్మాపూర్, కందనెల్లి, దుగ్గాపూర్, రెగొండి, చైతన్యనగర్, తదితర గ్రామాలలో గత ఆరు రోజులుగా మిషన్ భగిరథ నీళ్ళు బంద్ కావడంతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఇట్టి విషయంవార్త పత్రికలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన మిషన్ భగిరథ ఈఈ రవికుమార్, డిఈ రత్నప్రసాద్, డిఎల్‌పిఓ ప్రవీన్‌కుమార్, యంపిఓ రతన్‌సింగ్ తదితరులు మంగళవారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవసరమైన చోట బోరుమోటార్లు వేసి మిషన్ భగిరథ నీళ్ళు రానప్పుడు ట్యాంకులలో నీరు ఎక్కించి సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని సంబందిత అధికారులను ఆదేశించారు.

వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి కష్టాలు తలెత్తకుండా చూడాలని అన్నారు. గ్రామాలకు తాగు నీటి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని, అందుకు తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగిరథ గ్రిడ్, ఇంట్రా ఏఈలు రామక్రిష్ణ, దీరజ్, సర్పంచ్ భార్గవి, ఉపసర్పంచ్ మోహిద్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్, మాజీ యంపిటిసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంబాపూర్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న మిషన్ భగీరథ అధికారులు


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ నాగిళ్ల వెంకట్

## అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్

**కేశంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని లింగం ధన గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ నాగిళ్ళ వెంకట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు, అనంతరం అంగన్వాడి సిబ్బంది పనితీరుపై ఆరాతీస్తూ రికార్డులను పరిశీలించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కిషోర బాలికల ప్రతిజ్ఞ మరియు స్నేహసంఘాల ఏర్పాటు గురించి అంగన్వాడి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు .ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీశైలం వి ఒఎ గోపాల్, అంగన్వాడీ రంగమ్మ, ఆశ వర్కర్ మంజుల కిషోర్ బాలికలు.బాలింతలు గర్భిణులు మహిళలు పాల్గొన్నారు .

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి సర్పంచ్ చేయుత


పెళ్లికి ఆర్థిక సాయం చేస్తున్న సర్పంచ్ బీస కవిత కరుణాకర్ రెడ్డి

**కేశంపేట,ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డపెళ్లికి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ఎంతో ఔదార్యంతో ముందుకు వచ్చిన తొమ్మిది రేకుల సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి పేదింటి ఆడబిడలపై ఉన్న మమకారాన్ని మరోసారి చాటుకున్నారు. కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామములో నేడు బుధవారం తాడూరు చిట్టెమ్మ నర్సింలు దంపతుల కూతురు సంధ్య వివాహం జరిగేందుకు నిశ్చయమైనది విషయం తెలుసుకున్న సర్పంచ్ కవితా కరుణాకర్ రెడ్డి గొప్ప మనసుతో పెళ్లికూతురు తల్లిదండ్రులకు తన వంతు సహాయంగా రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కవిత కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలైన ఆడపిల్లలకు ఆర్థిక సహాయం చేయడం చాలా సంతోషకరంగా ఉందని ఇక ముందు కూడా ఇలాంటి సేవ కార్యక్రమాలు చేపడతామని ఆమె కొనియాడినారు. ఈ సందర్భంగా పెళ్లికూతురు కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎంతో గొప్పమనసుతో ఆడపిల్లలకు ఆర్థిక సహాయాన్ని అందించిన మనసున్న గ్రామసర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రవి నాయక్, వార్డు సభ్యులు గుత్తి చంద్రయ్య, కావలి వసంత, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి, గుత్తి శేఖర్, రామ్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి ,కందన శివయ్య ,నాగిళ్ల యాదయ్య, ఖజా అలీ ,సుభాన్ రెడ్డి, కానుగుల చెన్నయ్య ,కావలి చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కోతుల బెడద.. యాచారం సర్పంచ్ వినూత్న ప్రయత్నం

**యాచారం,ఏప్రిల్ 28,ప్రభాతవార్త :** యాచారం మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రత ఉన్నందున గ్రామ సర్పంచ్ మస్కు అనిత శరణం ఎలుగుబంటు వేషధారణలో వ్యక్తిని వీధుల్లో నడిపించి కోతులకు బెదిరింపు చేపట్టారు. గత కొంతకాలంగా యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ భర్త శరణం గ్రామంలో కారోబర్గా పనిచేశారు. ఆయనకున్న ఆలోచనతో కోతులను బెదిరించాలని వాటినుండే కలిగే ఇబ్బంది దూరం కావాలని వినూతనంగా ఆలోచించి ఓ వ్యక్తికి ఎలుగుబంటి వేషధారణ వేసి ఊరేగించడంతో ఆయా ప్రాంతాలలో కోతులు పారిపోయాయి. దీంతో గ్రామంలో మరింత మంచి వాతావరణం ఏర్పడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


యాచారంలో కోతుల బెడద కోసం ఎలుగుబంటి వేషధారణలో వ్యక్తి

## ఉపాధి కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

**కొడంగల్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:**
ఎండాకాలం వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు గాను గ్రామ సర్పంచ్ వార్ల కల్పనసంతోష్ ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్,మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.మండల పరిధిలోని పాటుమీదిపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను గ్రామ సర్పంచ్ వార్ల కవితసంతోష్ మంగళవారం పరిశీలించారు.కొనసాగుతున్న ఉపాధి పనుల పరిశీలనలో భాగంగా కూలీ గిట్టుబాటు,సమస్యలపై కూలీలను అడిగి తెలుసుకున్నారు.ఉపాధి పనులకు నిత్యం ఎంతమంది కూలీలు వస్తున్నారు,వారికి రోజువారిగా కూలీ ఎంత అందుతొంది తదితర అంశాలపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు.రోజురోజుకు ఎండలు అధికమవుతుండడంతో వేసవి తాపం నుంచి కూలీలు ఉపశమనం పొందేందుకు గాను సర్పంచ్ వార్ల కవితసంతోష్ ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్,మజ్జిగ ప్యాకెట్‌లను అందజేశారు.ఈ సందర్భంగా ఉపాధి కూలీలు ఉన్నారు.


ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందిస్తున్న సర్పంచ్

## బాలల భద్రతపై అవగాహనసదస్సు

### హాజరైన వెల్జర్ల గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్

**షాద్‌నగర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని వెల్ జర్ల గ్రామంలో మహిళలు మరియు బాలల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినవి.ఈ కార్యక్రమాలలో లింగ సమానత్వం, మహిళల భద్రత, వేధింపుల నివారణ, పిల్లల సమగ్ర పెంపకం, సోషల్ మీడియా ప్రభావం, సైబర్ నేరాలపై ప్రజలకు వివరంగా తెలియజేయబడినది. ముఖ్యంగా మహిళలు మరియు బాలబాలికలు ఎదుర్కొనే సమస్యలు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించబడినదిఈ సందర్భంగా వెల్ జర్ల గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ పాల్గొని మహిళలు మరియు పిల్లల భద్రతపై విశేషంగా అవగాహన కల్పించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మహిళలు, బాలబాలికల రక్షణకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్,అంగన్ వాడి టీచర్స్ బి సుజాత, ఉమ, కె, సుజాత, ఆయలు సునీత, పుష్ప మ్మ, శ్రినిత, వి ఎ వో లు పుష్ప, అనిత మరియు కిషోర బాలికలు పాల్గొన్నారు.



# నెరవేరిన పాపిరెడ్డి గూడ గ్రామస్తుల చిరకాల కోరిక

### -పాపిరెడ్డిగూడలో రూ.82 లక్షలతో బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కేశంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** నేటితో పాపిరెడ్డి కూడా గ్రామస్తుల చిరకాల కోరిక నెరవేరింది. కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ అవాజీమియా పడకల్ గ్రామంలో రూ.82 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, ప్రాంతీయ అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని తెలిపారు.ఈ సందర్భంగా కీ.శే. తాండ్ర వీరేందర్ రెడ్డి గారి చిరకాల కోరిక నెరవేర్చినందుకు ఎమ్మెల్యేకు మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్, గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్య, మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బిటి రోడ్డు పనులకు శంకుస్తాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# కారు ఆటో ఢీకొని ..ఇద్దరు వ్యక్తులు దుర్మరణం

**యాచారం,ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**
ఎదురెదురుగా ఆటోను కారు ఢీకొట్టడంతో ఆటోలోని ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. సిఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం యాచారం మండల పరిధిలోని సాగర్ రహదారిపై డిఎస్ఆర్ గార్డెన్ సమీపంలో హైదరాబాదు నుండి వస్తున్న ఆటో మాల్ నుండి వస్తున్న కారు అతివేగంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. కార్లో ఉన్న వారికి తీవ్ర గాయాలుఅయ్యాయి. ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు మాడుగుల మండలం నాగిళ్ల గ్రామం కొర్ర తండకు చెందిన కొర్ర జాను (47) కోర్ర నర్సా (39) వ్యవసాయ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు ప్రమాదంలో చికిత్స పొందుతూ వేరు వేరు ఆసుపత్రిలో మృతి చెందారు.కారు డ్రైవర్ ఘనపురం వెంకటేశ్వర్లు హస్తినాపురం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఆయనతో పాటు కారులో ఉన్న ముగ్గురు తీవ్ర గాయాలపాలైనట్లు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# పల్లె బ్రదర్స్ సేవలు అభినందనీయం

**కేశంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :**జన్మనిచ్చిన తల్లిదండ్రులను స్మరించుకుంటూ వారి పేర్ల పై కొండారెడ్డిపల్లిలో గ్రామంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్న పల్లె బ్రదర్స్ లను ఆదర్శంగా తీసుకోవాలని షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ డబ్బులు అందరికి ఉన్న సేవ చేయాలని గొప్ప మనసు కొందరికే ఉంటుందని అలాంటి గొప్ప మనసు ఉన్న యువ నాయకులు పల్లె ఆనంద్ కుమార్ బాలేశ్వర్ లు అని వారికి ప్రత్యేకంగా అభినందించారు తెలిపారు. ముఖ్యంగా విద్యపై ఉన్న మమకారంతో పేద విద్యార్థులకు పల్లె బ్రదర్స్ సైకిళ్లను అందజేయడం ఎంతోఅభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ అతని సోదరుడు పల్లె బాలేశ్వర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 92 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే విర్ల పల్లి శంకర్ చేతుల మీదుగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు శరీర దారుఢ్యం పెంపొందించాలనే లక్ష్యంతో పల్లె బ్రదర్స్ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గ్రామంలో గత కొన్ని సంవత్సరాల నుండి తల్లిదండ్రులు పల్లె పద్మమ్మ వెంకటయ్య ల జ్ఞాపకార్థం గ్రామంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన ఘనత వారికే దక్కుతుందన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఎందరో ఉన్నత పదవులలో కొనసాగుతున్నారని, విద్యార్థులు ప్రజలతో పాటు శరీరదారుఢ్యం పెంపొందించుకోవాలనే సంకల్పంతోనే సైకిల్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోవు రోజులలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె స్వాతి బాలేశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశం, మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి, నాయకులు శ్రీధర్ రెడ్డి, సర్పంచులు శశిరేఖ, భాస్కర్ గౌడ్, నాగేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, గ్రామ దేవాలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ సర్పంచి రాజు, గ్రామ మాజీ సర్పంచ్ రాజు ఉపసర్పంచ్ లు శ్రీను, శివ మల్లేష్ గౌడ్,పసుల లింగం, నాయకులు అనసూయమ్మ, రాణి, గిరి యాదవ్, పర్వతాలు, రాములు, రామ్ రెడ్డి గ్రామస్తులు మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కొండారెడ్డిపల్లిలో గ్రామంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే,పల్లె బ్రదర్స్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్

## బాల్య వివాహాలు భవిష్యత్తుకు ఆటంకం

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 28, ప్రభాతవార్త:** బాల్య వివాహాలు చేయడం వల్లన భవిషత్తుకు ఆటంకం కలిగిస్తాయని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో సర్పంచ్ శ్వేత చంద్రబాబుగౌడ్ అధ్యక్షతన 99రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగ చైల్డ్ సెప్టీ ప్రొటెక్షన్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఓ మాట్లాడుతూ సమాజంలో బలికలపై జరుగుతున్న అరచకాలను నిలువరించేందుకు ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువస్తుందని అన్నారు. బాలికలకు మంచి గుర్తింపు ఇవ్వాలని ఆయన పెర్కొన్నారు. సమాజంలో బాలికలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జగదీశ్వర్, తదితరులు ఉన్నారు.

## టీనేజ్ వయస్సు.. జాగ్రత్తగా ఉంటే ఉషస్సు..

### చిన్నారులు, టీనేజి పిల్లలకు చైల్డ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం..


పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

**షాద్‌నగర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** చిన్నతనం నుంచి టీనేజ్ వరకు పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన, సమాజం పైన కూడా ఉందని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం అన్నారు. షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చైల్డ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీనేజీలో గర్భధారణ వల్ల కలిగే ఇబ్బందులు, ఎల్లోమెంట్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్సు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగకరమైన కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు. టీనేజ్ వయసులో బాలబాలికలు అతి జాగ్రత్తగా మసులుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల నివారణపై చైతన్యాన్ని తెస్తూ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఎంపీడీవో బన్సీలాల్, కమిషనర్ సునీత రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది సూపర్వైజర్ విజయలక్ష్మి, సంధ్యారాణి, వెంకటమ్మ, షీ టీం సిబ్బంది సురేష్, విజయ్, కౌన్సిలర్లు శ్రావణి, మురళీ మనోహర్ అప్పి, పెంటయ్య, కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, అనిత, చందులాల్, ముబారక్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ అవకాశాలను సద్వినియోగించుకోండి

**కేశంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :**
జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ 108, 102 లలో రంగారెడ్డి జిల్లా పరిధిలో అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ మరియు అంబులెన్స్ డ్రైవర్ ( పైలెట్) పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. 108 అంబులెన్స్ నందు ఈఎంపి అర్హతలు బీఎస్సీ, లైఫ్ సైన్సెస్, జీఎన్ఎమ్ డిప్లొమా ఇన్ లైఫ్ సైన్స్ పాసై ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. 102 అంబులెన్స్ డ్రైవర్ (పైలట్) దరఖాస్తు చేసుకునేవారు పదవ తరగతి పాస్ అయి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండవలెను. ఎన్నికైన అభ్యర్థులు వికారాబాద్ రంగారెడ్డి జిల్లాలో ఈ ప్రదేశంలో నైనా పనిచేయవలసి ఉంటుందని ఈ ఇంటర్వ్యూ ఈనెల 30 తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని ఈ ఇంటర్వ్యూలు షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి లో నిర్వహించడం జరుగుతుందని ఇతరత్రా సమాచారం కొరకు 9100799167 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.



## ఉన్నత విద్యకోసం విదేశాలు వెళుతున్న సంపత్‌కు ఆశీర్వాదాలు

**షాద్‌నగర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** షాద్ నగర్ 9 వార్డు మల్లికార్జున కాలనీకి చెందిన సీనియర్ ఫోటో గ్రాఫర్ తిరుమల ఫోటో స్టూడియో పోతుల వెంకటేష్ కుమారుడు పోతుల సంపత్ కుమార్, యూకే యునైటెడ్ కింగ్డమ్ లో ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళుతున్న సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకుని వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే శంకర్‌ను మర్యాదపూర్వ కలుసుకున్న చైర్మన్ మెట్టు సాయికుమార్

**షాద్‌నగర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** "సంఘటన్ సృజన్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా షాద్ నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మెట్టు సాయికుమార్ షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ను మర్యాద పూర్వకంగా కలువడం జరిగింది, ఈ స సందర్భంగా. కాంగ్రెస్ మండల అధ్యక్షులు నూతన నియమ్నాక గురించి ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ తో చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్,బ్లాక్ కాంగ్రెసు అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్,రాజు, కౌన్సిలర్లు పెంటయ్య, కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, బాచ్చలి నరేష్ ,బుచ్చయ్య, ముబారక్ అలీ ఖాన్, చందు, ఆంజనేయులు, ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శంకర్‌ను కలుసుకున్న మెట్టు సాయికుమార్

## పేదింటి ఆడపడుచు వివాహానికి సాయం

**షాద్ నగర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** నిరుపేద ఇంట వివాహానికి సాయం అందించేందుకు ఫరూక్ నగర్ మండలం పీర్లగూడ గ్రామ సర్పంచ్ షమీం బేగం ముందుకు వచ్చారు. గ్రామంలో ఏ ఇంట్లో ఆడపడుచు పెళ్లి అయిన వారికి 10000 రూపాయలు ఇచ్చేందుకు గ్రామ సర్పంచ్ షమీం బేగం ఆమె కుమారులు ఎంతో ఔదార్యంతో ప్రకటన చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన ఆకులమురి సాయిలు మంజుల కూతురు వివాహం ఈనెల 30వ తేదీన నిశ్చయం అయింది. వివాహం నిమిత్తం తన వంతు సహాయంగా తన భర్త పేరు కీర్తి శేషులు అజ్మీర్ ఘోరి పేరు మీద రూ. 10,000 అందించారు. ఈ సందర్భంగా ఆకులముని సాయిలు మంజుల కుటుంబ సభ్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ప్రతి పేద ఇంటి బిడ్డకు పదివేల రూపాయలు తమ సొంతంగా అందిస్తామని సర్పంచ్ షమీ బేగం కుమారులు తెలిపారు. కార్యక్రమంలో నవాజ్ ఘోరి ఖాదర్ ఘోరి , చిక్కల సిద్దయ్య, గుంటి ఎల్లయ్య పైల్వాన్ ఘోరి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.



యువతి వివాహానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్


పర్సాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తున్న నాయకులు

## వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్

**కొడంగల్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తు ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్ అన్నారు.మంగళవారం మండల పరిధిలోని పర్సాపూర్‌లో గ్రామ సర్పంచ్ కన్నం రాధశ్రీనివాస్‌రెడ్డి అద్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ కేంద్రం సమక్షంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంబించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని మద్య దళారులను ఆశ్రయించి మోసపోరాదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వమే మద్దతు ధర కల్పిస్తు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అంతేగాక విక్రయించిన ధాన్యానికి బోనస్‌తో పాటు వారం రోజుల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు.అలాగే మండల పరిధిలోని హస్నాబాద్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ పద్మమ్మ ప్రారంబించారు.ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త,మార్కెట్ కమిటీ చైర్మెన్ అంబయ్యగౌడ్,మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్,తహశీల్దార్ రాంబాబు,గ్రామ ఉపసర్పంచ్ బెస్త శివమ్మ,వార్డు సభ్యులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,గ్రామ పంచాయతీ కార్యదర్శి కల్పన,ఏఈఓ అశ్వినిలతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.


మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి , ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల పెద్ద ఎల్లయ్య,,65 మంగళవారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులను సర్పంచ్ భీమమ్మ బాలస్వామి పరామర్శించి వ్యక్తిగతంగా రూ.3వేలు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.3వేలు, మొత్తం రూ.6వేలు, ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమమ్మ బాలస్వామి, నాయకులు బుడ్డ వెంకటయ్య మహేష్ బోరి కుమార్ చంద్రయ్య శివలింగం నాయకులు బుడ్డ వెంకటయ్య మహేష్ బోరి కుమార్ చంద్రయ్య శివలింగం డీలర్ గొడుగు యాదగిరి తదితరులు ఉన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..**
తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామంలో మృతి చెందిన ఎర్రోళ్ల పెద్ద ఎల్లయ్య మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దోకురు ప్రభాకర్ రెడ్డి రూ.3వేలు, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

## టీనేజ్ గర్భధారణపై అవగాహన సదస్సు




**తలకొండపల్లి, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మంగళవారం నాడు టీనేజ్ గర్భధారణ పై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సంఘయపల్లి గ్రామంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. మండలంలోని వెల్జాల్, చుక్కాపూర్ , గ్రామాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చైల్డ్ సేఫ్టీ వీక్ మరియు టీనేజ్ గర్భధారణపై చిన్నపిల్లలకు ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు లోపు పెళ్లిళ్ల చేసుకోకూడదని బాలికలు పెళ్లిళ్ల చేయకూడదని భవిష్యత్తులో సమస్యలు ఎదురవుతాయని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రాంపూర్ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్, వెల్జాల్ సర్పంచ్ వానరాశి రాములమ్మ, చుక్కాపూర్ సర్పంచ్ మాకం వీరేశలింగం, పల్లె దవఖాన డాక్టర్ సంధ్య, అంగన్వాడి సూపర్వైజర్లు, తిరుమల, ఆయాలు, అంగన్వాడి టీచర్ , గర్భిణీ స్త్రీలు గ్రామస్తులు ఆయా గ్రామాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టండి

### ఎస్పై రవీంద్ర నాయక్

**కొందుర్గు, ఏప్రిల్ 28 ,ప్రభాతవార్త:** చిన్న వయసులో బాలికలకు పెళ్లిళ్ల చేయకుండా, వారిని ఉన్నత చదువులు చదివించాలని స్థానిక ఎస్పై రవీంద్ర నాయక్ తల్లిదండ్రులను కోరారు. మంగళవారం నాడు ప్రజా పాలన ప్రగతి నివేదిక... 99 రోజుల కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు సర్పంచ్ చౌడాపురం ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభకు తహసిల్దార్ ఆజం అలీ, ఎంపీడీవో లక్ష్మి అనురాధ, సిడిపిఓ ఉదయ,ఎంపీ ఓ విజయ్ కుమార్ పాల్ , డాక్టర్ అమృత జోసఫ్ లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ఎంతో మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నవయసులో బాల్య వివాహాలు చేస్తూ వారి భవిష్యత్తుకు ఆటంకం కల్పిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం 18 సంవత్సరాలు దాటిన తర్వాతనే వివాహం చేయాలని ఆయన సూచించారు. షాద్నగర్ సిడిపిఓ మాట్లాడుతూ 14 నుంచి 18 సంవత్సరాల వయసులో పిల్లలందరికి సరైన పోషక ఆహారాలు అందించాలని ఆమె తల్లిదండ్రులను కోరారు. ప్రతి బాలికను కనీసం డిగ్రీ వరకు చదివించాలని ఆమె కోరారు. యుక్త వయసులో ఉన్న బాలికలు కళాశాలకు వెళ్లి ఇంటికి వచ్చేవరకు వారి ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు ఎప్పుడు గమనించాలని, రక్షణగా ఉండాలని షీ టీం అధికారిని కోరారు. మహిళల రక్షణ కోసం షీ టీం ఎప్పుడు అందుబాటులో ఉంటుందని ఆమె వివరించారు. డాక్టర్ అమృత జోసెఫ్ మాట్లాడుతూ అమ్మాయిలు ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించాలని, సలహాలు సూచనలు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని డాక్టర్ తెలిపారు.

ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి సురేఖ, ఉప సర్పంచ్ చంద్రశేఖర్, పంచాయతీ సభ్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజి ఎంపిటిసి

## దళిత బిడ్డలకు అన్యాయం చేస్తున్నారు

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 28, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పద్మారం గ్రామంలో జరిగిన ఈదమ్మ జాతరలోఎల్కగుడెం సర్పంచ్ బందయ్య పై జరిగిన దాడిలో అగ్రకులాలకు చెందిన వారిని వదిలిపెట్టి అణగారిన కులాలకు చెందిన వ్యక్తులపై కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమని మాజి ఎంపిటిసి మాణెయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బందయ్యపై జరిగిన దాడిపై విచారణ వ్యక్తం చేశారు. అయితే ఇద్దరి రెడ్డిలు చిల్క మర్రి రాంరెడ్డి ,యర్ర బోతు రాంరెడ్డిల మధ్యన జరిగిన గొడవలో బలి పశువుగా మారింది మాదిగ బిడ్డలనని అన్నారు. పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ సామాన్య సామాజిక దళిత బిడ్డలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కేవలం రాజకీయ లబ్ధికోసం ఎల్కగూడ సర్పంచ్ ఘటనను పెద్దగా చేస్తున్నారని అన్నారు. చిన్నకులాలను టార్గెట్ చేయడం సరికాదని నిజమైన దోషులను గుర్తించి శిక్షించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్ రామ్ చరణ్, కార్మిక విభాగం నాయకులు నర్సింహులు, భాస్కర్ మాజీ ఎంపీటీసీ రాములు, వంశీ ,గొడుగొని పల్లి నర్సింలు, భీమయ్య, మోతిలాల్, జాంగిం,మహేందర్, అనిల్, రమేష్, మల్లేష్, నరేష్ గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ దేవి రామ్‌చరణ్

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 28, ప్రభాతవార్త:** ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యతని జిల్లేడు చౌదరి గూడ మండలంలోని చింత కుంట తండా సర్పంచ్ దేవీ రామ్ చరణ్ అన్నారు. మంగళవారం భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు వసంత, పుష్ప, సోనల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ గిరిజన తండాల్లో ఒకప్పుడు ఆడ పిల్లలు పుడితే అమ్ముకోవడానికి ప్రయత్నించే వారని నేడు సమాజంలో ఆడపిల్లకు లభిస్తున్న ఆదరణ, గౌరవం హక్కులను గుర్తించి ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను ఉన్నతంగా రాణించే విధంగా మంచి చదువులు చెప్పించి ప్రయోజకులను తయారు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అదేవిధంగా 18సంవత్సరాలు నిండే వరకు పెళ్లిళ్ల చేయవద్దని సూచించారు. ప్రభుత్వాలు ఆడపిల్లల సంరక్షణకు ఎన్నో రకాల సంక్షేమ కార్యక్రమాలు చట్టాలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. రాజ్యాంగం లో కల్పించిన హక్కులు నేడు రాజకీయంలో సైతం 50 శాతం మహిళలు రాణించగలుగుతున్నారని గుర్తు చేశారు. అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత ఉన్నది గుర్తించి తల్లిదండ్రులు పిల్లలను చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ శశికళ, ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు రామ్ చరణ్, గ్రీన్ ఛాలెంజ్ మండల కోఆర్డినేటర్ వినోద్ నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ గణనతో సమయాన్ని ఆదా చేసుకోండి

**....మోమిన్‌పేట్ తహసిల్దార్ రవీందర్**



**మోమిన్‌పేట్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** జనాబా లెక్కలు 2027లో భాగంగా ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని మో మిన్‌పేట్ తహసిల్దార్ రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లా డుతూ ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి ప్రజలే తమ కుటుంబ వివ రాలను స్వయంగా నమో దు చేసుకొనే ఈ సౌకర్యం ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రవీందర్ మాట్లాడుతూ ప్రజలు ప్రభు త్వంపై ఆధారపడకుండా స్వయంగా తమ వివరాలను నమోదు చేసు కోవడం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవచ్చునని, ఇది పారదర్శకతను పెంచడంతో పాటు, గణన ప్రక్రియను వేగవంతం చేస్తుందని పేర్కొన్నారు. స్వీయ గణన కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని, అందులో కుటుంబ యజమాని మొబైల్ నెంబరుతో ఒటిపి ద్వారా లాగిన్ అయి, జిల్లా, గ్రామం, పట్టణం, పిన్‌కోడ్, ఇంటి లొకేషన్ వంటి వివరాలను నమోదు చేయాలని సూచించారు. గృహానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, వివరాలను సమర్పించిన తర్వాత ప్రత్యేకంగా ఎస్ఇ ఐడి లభిస్తుందని చెప్పారు. మే 11, తర్వాత తమ ఇంటికి వచ్చే గణన అధికారికి ఈ ఎస్ఇ ఐడి చూపిస్తే నమోదు ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని వివరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమం విజయవంతమౌతుందని, ప్రతి కుటుంబం బాధ్యతగా స్వీయగణనలో పాల్గొనాలని తహసిల్దార్ రవీందర్ విజ్ఞప్తి చేశారు. "మన సమాచారం--మన చేతుల్లోనే" అనే భావనతో ప్రజలు ముందుకు రావాలని అధికారులు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు.

## 30నుండి వెంకటాపూర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ వెంకటాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహోత్సవాలు ఈ నెల 30 వ తేది నుండి మే నెల 4 వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎల్. భాగ్యలక్ష్మి మంగళవారం నాడొక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి బ్రహోత్సవాల్లో భాగంగా మే నెల 1 వ తేదిన శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం, అన్న ప్రసాద వితరణ రెండో తేదిన గరుడ సేవ, మూడో తేదిన ఆదివారం ఉదయం స్వామి వారి రథోత్సవ వేడుకలు, 4వ తేదిన చక్రతీర్థం, సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం పూజలు ఉంటాయని ఆలయ ఈవో పేర్కొన్నారు. స్వామి వారి బ్రహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**వార్తకు స్పందన**

## చెంచుపల్లిని సందర్శించిన విద్యుత్తు,హౌసింగ్ శాఖల అధికారులు



పూడూరు మండలం చెంచుపల్లిలో విద్యుత్తు స్థంభాన్ని పరిశీలిస్తున్న అధికారులు, సర్పంచ్ తదితరులు



పూడూరు మండలం చెంచుపల్లిలో ఇందిరమ్మ ఇంటికి ముగ్గుపోసి మార్కింగ్ ఇచ్చిన అధికారులు,సర్పంచ్ తదితరులు

**పూడూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి అనుబంధగ్రామం చెంచుపల్లిని మంగళవారం విద్యుత్తు,హౌసింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. బాత్రూమే ఆమెకుగూడు అన్న శీర్షికన ఈనెల 19వతేదీన వార్తా దినపత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందించిన సంబందిత అధికారులు గ్రామ సర్పంచ్ దయాకర్‌తో కలిసి చెంచుపల్లిలోని ఇందిరమ్మ గృహాల లబ్దిదారుల ఇండ్లపై ఉన్న విద్యుత్తు వైర్లను,అర్ధాంతరంగా ఆగిన ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను కలిసి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లనిర్మాణాలకు అడ్డంకిగా ఇండ్లపై ఉన్న విద్యుత్తు వైర్లను బుధవారంనుండే తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇప్పటి వరకు (గ్రౌండ్‌కాని) నాన్‌స్టార్టెడ్ ఇందిరమ్మ గృహాలను కూడా లబ్దిదారులు వెంటనే నిర్మాణపు పనులు ప్రారంభించాలని సూచించారు. చెంచుపల్లిలో బొమ్మరాస్ అంజమ్మ అనే మహిళ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గువేసి మార్కింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు ఎస్ఇ రవి, ఎడి నాయుడు, ప్రసాద్, ఎఇ రాజు, హౌసింగ్ పిడి ముకారాం, ఎఇ ఉదయ్, పలువురు అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్జాల్లో ఘోర రోడ్డు ప్రమాదం

**...తీర్థయాత్రలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురెదురు కార్లు ఢీకొని**
**...అంతారం గ్రామానికి చెందిన శారదమ్మ, పెద్ద శీను మృతి**
**...పలువురికి తీవ్ర గాయాలు**





**తలకొండపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త;**
తీర్థయాత్రలకు కోసం ఫ్యామిలీ మొత్తం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో తమ సొంత గ్రామం రెండు కిలోమీటర్ల దూరంలో తమ సొంత గ్రామం రెండు కిలోమీటర్ల దూరంలో ఉందనగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు మృతి, పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన తిరుమణి శ్రీను కుటుంబ సభ్యులు తమ సొంత కారు 07 2013 నంబర్ గల కార్లు తీర్థయాత్రలకు వెళ్లారు. తిరుగు ప్రయాణం లో మంగళవారం సాయంత్రం సుమారు3.30 గంటల సమయంలో తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో లోకి చేరుకోగానే వెల్జాల్ గ్రామంలోని వేదాద్రి లక్ష్మి ్మ నరసింహ స్వామి దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్న మురళీధర్ శర్మ, దత్తు శర్మలు మరో కారు ఫిగో 07 8473 నంబర్ గల కారుతో హైదరాబాదు బయలుదేరుతున్నారు. అదే సమయంలో వెల్జాల్ గ్రామ సమీపంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి.
కారులో ప్రయాణిస్తున్న తిరుమణి శారదమ్మ(,58) , అక్కడికక్కడే మృతి చెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో తిరుమణి పెద్ద శీను(45) మృతి చెందాడు. దీంతో ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో అంతారం గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. అనుకోని సంఘటనలో త్వరలో తమ గ్రామానికి చేరుకుంటున్నామన్న సంతోషంలో ఉండగా తీవ్ర ప్రమాదానికి గురై ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. మరో కారులో తీవ్ర గాయాలకు గురైన మురళీధర్ శర్మ దత్తు శర్మలను హైదరాబాదులోని ఆసుపత్రికి హైదరాబాదులోని ఆసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటన తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా చేసి నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక సిఐ జానకిరామ్ రెడ్డి తెలిపారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం




మేడ్చల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్

**మేడ్చల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందు గాను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నదని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహ్లు యాదవ్ అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మేడ్చల్‌తో పాటు ఎల్లంపేట మున్సిపల్ పరిధి కోనాయిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను విక్రయించుకోవాలని కోరారు. గ్రామాల రైతులకు ఈ కొనుగోలు కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వం ముఖ్య లక్ష ్యమని, రైతుల సంక్షేమం కోసం ఇలాంటి కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి, వైస్ చైర్మన్ రజిత, మేడ్చల్ పిఎసిఎస్ మాజీ చైర్మన్ అంతిరెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్లు రాజు కురుమ, భిక్షపతి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రమణా రెడ్డి, చాపరాజు, మహేష్, వెంకట్ రాంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

**ఎస్ఐ రమేష్ కుమార్**



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

**కుల్కచర్ల,ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** అనుమత్తులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తిసుకుంటామని ఎస్ఐ రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనియ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా గాదీర్యాల్ గ్రామానికి చెందిన జిలకరంపు మధు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌నుపట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ కుమార్ మాట్లాడుతూ...అక్రమ ఇసుక రవాణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## ఖాతాదారులకు శాపంగా మారిన వేముల నర్వ కెనరా బ్యాంక్




**కేశంపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోనివేముల నర్వ గ్రామంలో కెనరా బ్యాంక్ బ్యాంక్ అధికారుల పనితీరుపై ఖాతాదారులు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 20 రోజుల నుండి బ్యాంక్ అధికారులు కస్టమర్లకు ఇబ్బందులు పెడుతున్నారు, ఏమిటి అని నిలదీయగా బ్యాంకు ఆడిట్ జరుగుతుందని చెప్పుకొచ్చారు .తీరా 25 రోజుల తర్వాత కూడా సర్వర్ పనిచేయట్లేదు బంగారం పెట్టుకోవడం కుదరదు, రేపు రండి అని బ్యాంక్ అధికారులు నిరక్ష ్యంగా సమాధానం ఇవ్వడం జరిగింది. గ్రామంలో అధిక మొత్తంలో రైతులు ఖాతాలు ఉన్నాయి, రోజుల తరబడి బ్యాంకుల చుట్టూ తిరుగుతూ వారి యొక్క బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. బ్యాంకులో బ్యాంకు మేనేజర్ నిరక్ష ్య సమాధానాలు ఇవ్వడం జరుగు తుంది. ఇకనైనా స్పందించి బ్యాంక్ అధికారుల పనితీరుపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని కెనరా బ్యాంక్ ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నేటితో కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల కమిటీలు రద్దు

**-మే 5 లోపు నూతన మండల, గ్రామ కమిటీల పూర్తిస్థాయి నియామకం - రికమండేషన్లు పనిచేయవు - పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు- కమిటీల్లో -మహిళలకు ప్రాధాన్యత - కనీసం ఐదేళ్లు పార్టీకోసం పనిచేసిన వారే అధ్యక్ష పదవికి అర్హులు- తెలంగాణ మత్స్య కార్పొరేషన్ చైర్మన్, సంఘటన సృజన్ అభియాన్ కమిటీ షాద్‌నగర్ డివిజన్ ఇంచార్జ్ మెట్టు సాయి కుమార్**



మాట్లాడుతున్న మెట్టు సాయికుమార్

**షాద్‌నగర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** నేటితో షాద్ నగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ, పట్టణ స్థాయి, మండల స్థాయి కమిటీలన్నీ రద్దయినట్లు తెలంగాణ ఫిషరీస్ చైర్మన్, సంఘటన్ సుజన్ అభియాన్ కమిటీ షాద్ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ మెట్టు సాయికుమార్ విల్లడించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంఘటన సుజన్ అభియాన్ కమిటీ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. మే 2 నుండి 5వ తేదీ లోపు షాద్ నగర్ నియోజకవర్గంలోని గ్రామ మండల స్థాయి కమిటీలను పూరిస్థాయిలో ఎన్నుకోవడం జరుగుతుంది అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఆఫీసులో పనిచేసిన వారికి మంచిది గుర్తింపు ఉంటుందని , కష్టపడ్డ వారికి పదవులు దక్కుతాయన్నారు. గ్రామ మండల స్థాయి కమిటీల ఎంపికలో ఎలాంటి రికమండేషన్లు నడవవన్నారు. షాద్ నగర్ డివిజన్ లోనీ బ్లాక్ ఏ లో ఉన్న షాద్ నగర్ మున్సిపాలిటీ తో పాటు ఫరూక్ నగర్, కొందుర్గు, చౌదర్ గూడెం, అదేవిధంగా బ్లాక్ బీ లో ఉన్న కొత్తూరు మున్సిపాలిటీ తో పాటుగా కొత్తూరు మండలం, నందిగామ మండలం, కేశంపేట మండలాలకు మే 5 లోపు పార్టీ కమిటీ ల నియామకం పూర్తి అవుతుంది అన్నారు. మండల కమిటీ అనంతరం జిల్లా కమిటీల ఏర్పాటు ఉంటుందన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా కాంగ్రెస్ పార్టీ కింది స్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటుచేసి ముందుకు పోతుంది అన్నారు. తరుణ ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు పార్టీ కార్యకర్తలను సిద్ధం చేయడమే ఈ కమిటీల లక్ష ్యం అన్నారు. మండల అధ్యక్ష పదవి కోసం కనీసం పార్టీకి ఐదు సంవత్సరాలు సేవలందించిన వారిని ప్రామాణికంగా తీసుకుంటామన్నారు. అదేవిధంగా ప్రతి మండల కమిటీలో మహిళలకు పదో నిలిచే విధంగా ముందుకు పోతున్నామన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీ ఖాన్ బాబర్ , మాజీ బ్లాక్ అధ్యక్షులు బాలరాజ్ గౌడ్, చదువుకోడం మండల పార్టీ మాజీ అధ్యక్షులు రాజు, సీనియర్ నాయకులు వీర్లపల్లి మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



హిందువులకు కాల పత్రాని అందజేస్తున్న హిందూ కమిటి సభ్యులు

## హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**కుల్కచర్ల,ఏప్రిల్,28 ప్రభాతవార్త:** మే 2న మండల కేంద్రంలోని నిర్వహించే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని హిందూ కమిటి సభ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని దుకాణ యజమానులకు కాల పత్రాన్ని అందజేసి కుటుంబ సమేతంగా రావాలని కోరారు. ఈ సందర్భంగా హిందూ కమిటి సభ్యులు మాట్లాడుతూ...హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. గ్రామాలలో హిందూ బంధువులందరికి సమాచారం చేరేల చూడాలన్నారు. హిందూ సమ్మేళనం అంటే ప్రతి హిందూకు పిలిస్తే కాదు తెలిస్తే రావాలని, హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## అడపడుచు పెళ్లికి అండగా సర్పంచ్



పెళ్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్

**కుల్కచర్ల,ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ప్రతి పేదింటి అడబిడ్డ పెళ్లిలకు అండగా ఉంటామని సర్పంచ్ శాంతి తులసి రామ్ నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పటేల్ చెరువు తాండ గ్రామ పంచాయతీ అనుబందమైన పోటిగడ్డ తాండవిస్లవత్ ఇంద్రబాయి సూర్యనాయక్ కూతురు సుమిత్ర వివాహనికి సర్పంచ్ శాంతి తులసి రామ్ నాయక్ తన సొంత డబ్బుతో ఒక క్వింటల్ సోన బియ్యం, 15 కేజిల వంట నూనె, మరియు 20 కూల్ ఫిల్టర్ డబ్బాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి తులసి రామ్ నాయక్ మాట్లాడుతూ.. పేదింటి అడబిడ్డ పెళ్లిళ్లకు ఎల్లప్పుడు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నివారణ సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు





అనురాగ్ యూనివర్శిటీలో డ్రగ్స్ నివారణ సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న పోచారం ఐటీ కారిడార్ సిఐ కనకయ్య గౌడ్.

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాత వార్త:** యువత దేశానికి శక్తియని వారి భవిష్యత్తు బంగారు మయం కావడానికి విద్యతో పాటు క్రమశిక్షణ, బాధ్యతతో మెలగాలని పోచారం ఐటి కారిడార్ సిఐ కనకయ్య గౌడ్ అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో మంగళవారం డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువతలో డ్రగ్స్ వినియోగం, సైబర్ నేరాలు, అక్రమ కార్యకలాపాల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ కనకయ్య గౌడ్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక సామాజిక చట్టపరమైన దుష్పరిణామాలను వివరించారు. యువత సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. యువత క్రమశిక్షణతో బాధ్యతతో మెలిగి సమాజానికి ఉపయోగపడే విధంగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థులు తమ పరిసరాల్లో జరిగే అనుమానస్పద అక్రమ కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండి అవసరమైతే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. దేశాభివృద్ధికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ విజయ్ కుమార్, ఎస్సై విజయ్ బాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సి. మల్లేశ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను కలుసుకున్న షాద్ నగర్ బిఆర్ఎస్వి నాయకుడు శీలం శ్రీకాంత్

**షాద్‌నగర్ టౌన్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్)ను హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్వి షాద్ నగర్ నియోజకవర్గం అద్యక్షులు శీలం శ్రీకాంత్. కెసిఆర్ పై అభిమానంతో ఎప్పుడు వీలున్నా ప్రత్యేకంగా కలుసుకుంటున్న శీలం శ్రీకాంత్. అనేక పర్యాయాలు నియోజకవర్గంలో ఓ సాధారణ నాయకుడుగా కెసిఆర్ ను కలుసుకున్న పేరు శీలం శ్రీకాంత్ కు ఉంది. కెసిఆర్ అంటే తనకు అత్యంత అభిమానం అని శీలం శ్రీకాంత్ మీడియాకు తెలిపారు.



మాజీ సీఎం కేసీఆర్ ను కలిసిన శీలం శ్రీకాంత్

## టిఎన్జిఓ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌కు సన్మానం

**షాద్ నగర్ టౌన్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** షాద్ నగర్ టిఎన్జిఓ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడు వైద్యాధికారి డాక్టర్ స్రవంతి గారు మరియు వారి యొక్క ఆరోగ్య సిబ్బంది సన్మానించారు. మా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి తాలూకా టి ఎన్జీవో ప్రెసిడెంట్ గా మీరు అయినందుకు చాలా గర్వంగా ఉందని సిబ్బంది శ్రీనివాస్ కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్రవంతి హెల్త్ సూపర్వైజర్ శ్రీ రామ ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ స్టాఫ్ నర్స్ వినీత ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



టీఎన్జీవో అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం